లోకం పోకడ



ఇక్కడ మూడుగంటల కరెంట్ పోనూ మిగతా కరెంటంతా మీకే ఫ్రెండ్స్!

స్టెమ్‌సెల్ చికిత్సతో డయాబెటిస్‌కు చెక్

టొరంటో: టైప్-1 డయాబెటిస్ రోగుల కోసం అమెరికా ఔషధ తయారీ కంపెనీ 'వయాసైట్' వినూత్నమైన 'స్టెమ్ సెల్' చికిత్స విధానాన్ని అభివృద్ధి చేసింది. అమెరికా, కెనడా, బెల్జియంలో నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో మెరుగైన ఫలితాలు వచ్చినట్టు ప్రముఖ జర్నల్ 'నాచుర్ బయోటెక్నాలజీ' నివేదిక పేర్కొన్నది. రోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకుంటూ.. రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రించుకోవాల్సిన అవసరం లేదని, ఈ పని 'పీసీ-02' అనే చిన్న పరికరం శరీరం లోపల నిర్వర్తిస్తుందని నివేదిక తెలిపింది. దీని ప్రకారం, నిరంతరం ఇన్సులిన్ విడుదలపై స్వీయ నియంత్రణ చేపట్టేందుకు ఓ చిన్న పరికరాన్ని రోగి చర్మం లోపల ప్రవేశపెడతారు. ఇది ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కర్మాగారంగా శరీరం లోపల పనిచేస్తుందని 'యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా' ప్రొఫెసర్ టిమోతీ కిఫర్ అన్నారు. కెనడాలోని వాంకోవర్ జనరల్ దవాఖాన, అమెరికా, బెల్జియంలలో క్లినికల్ ట్రయల్స్ జరిగాయి. ఆరు నెలల తర్వాత రోగులను పరిశీలించగా, వారి రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలోకి వచ్చాయని, ప్రతి రోజూ బయట నుంచి ఇన్సులిన్ తీసుకోవాల్సిన అవసరం తప్పిందని నివేదిక తెలిపింది.

ఎట్టకేలకు ఒక బిల్లును ఆమోదించిన కేరళ గవర్నర్

తిరువనంతపురం: సుప్రీంకోర్టు స్పందన నేపథ్యంలో కేరళ గవర్నర్ ఆరిఫ్ ఖాన్ ఒక బిల్లును ఆమోదించారు. మిగతా ఏడు బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వులో ఉంచారు. ఇటీవల పంజాబ్ వర్సెస్ గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు స్పందిస్తూ గవర్నర్లు బిల్లులను నిరవధికంగా తొక్కిపెట్టడం సరికాదని హితవు పలికిన విషయం తెలిసిందే.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా,నవంబర్ 28: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. నీట్ శిక్షణ పొందుతున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన 20 ఏండ్ల విద్యార్థి తాను అద్దెకు ఉంటున్న గదిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సూసైడ్ నోట్ కూడా లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. కోటాలో ఈ ఏడాది ఇప్పటివరకు 25 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

మరో మహోద్యమమే

- మా డిమాండ్లు పరిష్కరించకుంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తాం
- ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం
- మహాపడావ్‌లో రైతులు, కార్మికుల ప్రతిన
- ముగిసిన మూడు రోజుల ఆందోళనలు
- రాష్ట్రాల్లో రాజ్‌భవన్లకు భారీ ర్యాలీలు
- గవర్నర్లకు వినతిపత్రాల సమర్పణ

న్యూఢిల్లీ, నవంబర్ 28: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు మూడు రోజులపాటు జరిగిన దేశవ్యాప్త ఆందోళనలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఎస్పీ, రుణమాఫీ, లేబర్ కోడ్‌ల రద్దు తదితర డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తామని రైతులు, కార్మికులు ప్రతినబూనారు. రాబోవు రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. త్వరలో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకొంటామని నేతలు ప్రకటించారు. చివరి రోజు మంగళవారం దేశవ్యాప్తంగా జరిగిన కిసాన్-మజ్దూర్ 'మహాపడావ్'లో ఐదు అసెంబ్లీ ఎన్నికల రాష్ట్రాల మినహా దాదాపు అన్ని రాష్ట్రాల రాజధానుల్లో వేలాది సంఖ్యలో రైతులు, కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో తమ 21 డిమాండ్ల చార్టర్‌తో కూడిన వినతిపత్రాన్ని రైతు, కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయా రాష్ట్రాల గవర్నర్లకు అందజేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 26 నుంచి 28 వరకు ఈ దేశవ్యాప్త ఆందోళనలనకు పిలుపునిచ్చాయి. గవర్నర్లకు తమ డిమాండ్ల కూడిన మెమోరాండం సమర్పించిన తర్వాత రైతులు, కార్మికులు ఈ ఆందోళనలను విరమించారు. పంజాబ్‌లో రైతు ప్రతినిధులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గుర్మీత్ సింగ్‌ను కూడా కలిసి తమ డిమాండ్లను వివరించారు.

కార్పొరేట్ల కోసం మోదీ సర్కార్!

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సాగిన ఆందోళనలో ఏఐటీయూసీ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీజేపీ మతపరమైన, ఇతర అంశాలను తెరపైకి తీసుకొన్న విషయం అందరికీ అర్థమైందన్నారు. ఆలిండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) నేత విక్రమ్ సింగ్ మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటానికి ఈ ఆందోళనలు ప్రారంభం మాత్రమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కార్పొరేట్ల కోసం పనిచేస్తున్నదని దుయ్యబట్టారు. ప్రస్తుతం దేశ వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, రైతుల తమ పంటలకు కనీస మద్దతు ధర కూడా పొందలేకపోతున్నారని, ఫలితంగా అన్నదాతలు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'బీజేపీని పారదోలండి.. దేశాన్ని కాపాడండి'

తమకు వ్యతిరేకంగా పాలసీలు చేసే ప్రభుత్వాన్ని 2024 లోక్‌సభ ఎన్నికల్లో అనుమతించేది లేదని విక్రమ్ సింగ్ స్పష్టం చేశారు. అందుకే 'బీజేపీని పారదోలండి.. దేశాన్ని కాపాడండి' అనే నినాదం ఇచ్చామని అన్నారు. బీజేపీ ప్రతీ విషయంలోనూ గతంలో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కుతున్నదని సీఐటీయూ నేత పుష్పేంద్ర సింగ్ విమర్శించారు. కార్మికులను బానిసలుగా మార్చేందుకు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చాందని దుయ్యబట్టారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీతో గద్దెనెక్కిన కమలం పార్టీ.. ఇప్పుడు రైతుల ఆదాయాలు పడిపోయి, నష్టాల్లో కొట్టుమిట్టాడుతుంటే చోద్యం చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఎస్కేఎం, కేంద్ర కార్మిక సంఘాల నేతలు మరోసారి సమావేశమై, భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకొంటారని ఏఐసీసీటీయూ నేత శ్వేతా రాజ్ పేర్కొన్నారు.

పంజాబ్‌లోని మొహాలీలో నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

రైతులు, కార్మికుల ముఖ్యమైన డిమాండ్లు ఇవీ..

1. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి.
2. రైతులకు రుణమాఫీ చేయాలి, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు విరమించాలి.
3. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి.
4. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ కేంద్ర ప్రభుత్వం ఆపాలి.
5. విద్యుత్తు సవరణ బిల్లును తక్షణం వెనక్కు తీసుకోవాలి.
6. కనీస వేతనాలు పెంచాలి, యువతకు ఉపాధి కల్పించాలి.
7. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయాలి, ఆహార భద్రత కల్పించాలి.

టన్నెల్ నుంచి చిరునవ్వుతో బయటికి వస్తున్న కార్మికులు

17 రోజుల తర్వాత.. బాహ్య ప్రపంచంలోకి

- ఉత్తరకాశీ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్
- సురక్షితంగా బయటపడ్డ 41 మంది కార్మికులు
- కీలకపాత్ర పోషించిన 'ర్యాట్ హోల్ మైనర్స్'

న్యూఢిల్లీ: నిరీక్షణకు తెరపడింది. కోట్లాదిమంది భారతీయుల ప్రార్థనలు ఫలించాయి. ఉత్తరకాశీ టన్నెల్‌లో చిక్కుకున్న 41 మంది కార్మికులు 17 రోజుల తర్వాత మంగళవారం రాత్రి సురక్షితంగా బయటకు వచ్చారు. 'ర్యాట్-హోల్ మైనింగ్' నిపుణులు అద్భుతం సృష్టించారు. కూలిన సొరంగంలో మాన్యువల్‌గా తవ్వకాన్ని చేపట్టి 24 గంటల్లో 10 మీటర్ల లక్ష్యాన్ని పూర్తిచేశారు. తవ్విన మార్గం గూండా పైపులను పంపి.. ఎన్డీఆర్ఎఫ్, ఇతర సహాయక బృందాలు 41 మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రాణాలతో బయటకు వచ్చిన తమ వాళ్లను చూశాక.. కార్మిక కుటుంబాల సభ్యులు కన్నీంటి పర్యంతమయ్యారు. ఆనందంతో అక్కడున్నవారితో స్వీట్స్ పంచుకున్నారు. సొరంగం నుంచి బయటకు వచ్చిన కార్మికులను చిన్యాలిసౌర్ దవాఖానకు తరలించారు. కార్మికులు ఆరోగ్యంగా ఉన్నారా? లేదా? అన్నది పరిశీలించాక, వారిని స్వస్థలాలకు పంపనున్నారు.

అత్యాధునిక మిషన్లు విఫలమైన చోట..

అత్యాధునిక ఆగర్లు, ఇతర మిషన్లు విఫలమైనచోట 'ర్యాట్ హోల్ మైనింగ్' అద్భుతంగా పనిచేసిందని 'నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ' సభ్యుడు హస్నానీ వెల్లడించారు. ఈ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల్లో జార్ఖండ్ వాసులు అత్యధికంగా ఉన్నారు. 41మందిలో 15 మంది జార్ఖండ్ వాసులుకాగా, ఏడుగురు ఉత్తరప్రదేశ్, ఐదుగురు బీహార్, ఐదుగురు ఒడిశా, ముగ్గురు పశ్చిమ బెంగాల్, ముగ్గురు ఉత్తరాఖండ్, ఇద్దరు హిమాచల్ ప్రదేశ్, ఇద్దరు అస్సాం నుంచి ఉన్నారు.

ఎందుకీ టన్నెల్?

నాలుగు పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రిల మధ్య రోడ్ కనెక్టివిటీని అందించే లక్ష్యంతో కేంద్రం 'చార్‌ధామ్' ప్రాజెక్ట్ చేపట్టింది. దీంట్లో భాగంగానే 4.5 కిలోమీటర్ల టన్నెల్ నిర్మిస్తున్నది. ఉత్తరకాశీ జిల్లాలోని సిల్క్యారా, దండల్‌గావ్‌లను కలిపేమార్గంలో ఇది ఉంది. నవంబర్ 12న సిల్క్యారా వైపు నుంచి 205-260 మీటర్ల సొరంగానికి చెందిన ఒక భాగం ప్రమాదవశాత్తు కూలింది. దీంతో 260 మీటర్ల మార్క్‌కు అవతల కార్మికులు చిక్కుకుపోయారు.

ఏమిటీ 'ర్యాట్ హోల్ మైనింగ్'?

గనుల్లో బొగ్గును దొంగలించడానికి కొంతమంది ఈ టెక్నిక్‌ను ఉపయోగిస్తారు. కేవలం ఒకే ఒక్క మనిషి పట్టేంత వెడల్పుతో సొరంగాన్ని తవ్వి.. బొగ్గును దొంగలించటాన్ని 'ర్యాట్ హోల్ మైనింగ్'గా పేర్కొంటారు. ఈ టెక్నిక్‌తో మైనింగ్ చేయటం చట్టవిరుద్ధం. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2014లో ఈ విధానంపై నిషేధం విధించింది.

మహాయుతి కూటమిలో సీట్ల లొల్లి

ముంబై, నవంబర్ 28: మహారాష్ట్రలో తమ భాగస్వామ్య పక్షాలకు బీజేపీ షాకిచ్చింది. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలలో సీట్ల పంపకం గురించి కూటమి పార్టీలతో ఇంకా ఎలాంటి ఒప్పందం కుదరకపోయినా 48 స్థానాల్లో 26 సీట్లలో తాము పోటీ చేస్తామని బీజేపీ చెబుతున్నది. మిగిలిన 22 సీట్లను శివసేన, ఎన్సీపీ పంచుకోవాలని పేర్కొంటున్నది. బీజేపీ, శివసేన (షిండే వర్గం), ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) మహాయుతి కూటమిగా ఏర్పడిన విషయం తెలిసిందే. సీట్ల పంపకంపై బీజేపీ మీద షిండే సేన, అజిత్ పవార్ వర్గాలు మండిపడుతున్నాయి. దీనిపై శివసేన (షిండే వర్గం) మంత్రి ఒకరు మాట్లాడుతూ 'మా సంకీర్ణంలో బీజేపీ పెద్ద పార్టీ అన్న విషయం ఒప్పుకుంటాం. అయితే మా సహాయంతోనే బీజేపీ అధికారం చేపట్టిందన్న విషయాన్ని మరచిపోకూడదు కదా' అని ప్రశ్నించారు.

నల్లా నీళ్లు తాగినందుకు దళితుడి హత్య

బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో దారుణం

దబుల్ ట్రబుల్ ఇంజిన్

బుదౌన్(యూపీ): బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో దళితులపై వరుస దాడులు జరగడం ఆందోళన కలిగిస్తున్నది. తాజాగా పబ్లిక్ నల్లా నీళ్లు తాగాడని కమలేష్(24) అనే దళిత యువకుడిని కొందరు కట్టెలతో కొట్టి చంపారు. పోలీసుల కథనం ప్రకారం సోమవారం రాత్రి సాత్రా గ్రామంలోని పబ్లిక్ నల్లాలో నీళ్లు తాగాడని కమలేష్‌పై సూరజ్ రాథోడ్ అతడి సహచరులు దాడి చేశారు. వెంటనే బాధితుడిని దవాఖానకు తరలించారు. బాధితుడు చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయారు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేశారు.

కాంగ్రెస్ సర్కారుపై 'రుణ'భేరి

- డిసెంబర్ 23న బెంగళూరులో కర్ణాటక అన్నదాతల ఆందోళన
- రుణమాఫీ చేయాలని రైతుల డిమాండ్

హావేరి, నవంబర్ 28: కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు పాలనలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తును అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీ అమలులో ఘోరంగా విఫలమైంది. ఎడాపెడా విద్యుత్తు కోతలతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో పంట చేతికి వచ్చే పరిస్థితి లేక, అప్పులు తీర్చలేని స్థితిలో వందలాది మంది అన్నదాతలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారుపై రైతులు నిరసనలకు సిద్ధమవుతున్నారు.

రుణమాఫీ చేయాల్సిందే..

వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని సిద్ధరామయ్య సర్కారును రైతులు డిమాండ్ చేస్తున్నారు. వచ్చే నెల 23న బెంగళూరులో నిరసన భేరి మోగించబోతున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రీయ కిసాన్ మహా పంచాయత్ అధివేషణ ఆధ్వర్యంలో నిరసన చేపడుతామని రాష్ట్ర చెరుకు రైతుల సంఘం అధ్యక్షుడు కురుబర్ శాంతకుమార్ హెచ్చరించారు. కరువు కారణంగా రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం రైతుల కేమీ సాయం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కరువు తాలుకాల్లో రైతులకు విత్తన ఖర్చులు కూడా తిరిగి రాలేదు. ఈ కారణాలన్నింటి వల్ల బెంగళూరులో నిరసన సభ నిర్వహిస్తున్నాం' అని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, 60 ఏండ్లకు పైబడిన రైతులకు కనీసం రూ.5 వేలు పింఛను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. 'చెరకు పంట నష్టాలను ఎన్డీఆర్ఎఫ్ కింద పరిగణించి పంట నష్ట పరిహారం మంజూరు చేయాలి. తక్కువ దిగుబడి చూపించి, తూకాల్లో మోసాలు చేసే పరిశ్రమలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి' అని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

కర్ణాటక కాంగ్రెస్‌లో అసమ్మతి

- రాష్ట్రంలోని హస్తం పార్టీ నేతల మధ్య పదవుల పంచాయితీ
- ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్ల నియామకాల్లో విభేదాలు
- తనను సంప్రదించకపోవడంపై హోంమంత్రి అసంతృప్తి
- ఎట్టకేలకు సిద్ధమైన లిస్టు..హైకమాండ్‌కు పంపుతామన్న సీఎం

బెంగళూరు, నవంబర్ 28: కర్ణాటకలో ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లో అసమ్మతి తారాస్థాయికి చేరింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఇతర ముఖ్య నేతల మధ్య విభేదాలు, కుమ్ములాటలతో రాష్ట్రంలో పాలన పడకేసింది. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి మరీ నేతలు పదవుల కోసం కుస్తీలు పడుతున్నారు. రాష్ట్రంలోని కీలక ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్ల పదవుల పంపిణీ నేతల మధ్య చిచ్చు పెట్టింది. అసంతృప్తి జ్వాలలు రాజేసింది. తమ వర్గం ఎమ్మెల్యేలు, నేతలకు ఆ పదవులు ఇప్పించుకొనేందుకు రాష్ట్ర కీలక నేతలు ప్రయత్నాలు చేయడంతో ఆ పంచాయతీ గత కొన్ని నెలలుగా కొనసాగుతూనే ఉన్నది. నియామకాల విషయంలో రాష్ట్ర హోంమంత్రి జీ పరమేశ్వర తన అసంతృప్తి వెళ్లగక్కారు. ఈ పదవుల భర్తీకి సంబంధించి తనను ఎవరూ సంప్రదించలేదని బహిరంగానే తన అసమ్మతి వ్యక్తం చేశారు.

అధిష్ఠానం ఓకే చేస్తేనే..

ఎట్టకేలకు పదవుల భర్తీకి సంబంధించి తుది జాబితాను తయారు చేశామని, దాన్ని ఆమోదం కోసం పార్టీ హైకమాండ్‌కు పంపుతామని సీఎం సిద్ధరామయ్య మంగళవారం సాయంత్రం వెల్లడించారు. అధిష్ఠానం ఓకే చేస్తే.. ఆ తర్వాత నియామకాలు చేపడుతామని పేర్కొన్నారు. పదవుల భర్తీ విషయంపై రాష్ట్ర నేతలతో చర్చించేందుకు ఢిల్లీ నుంచి కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలా మంగళవారం మరోసారి బెంగళూరుకు వచ్చారు. గత వారం కూడా ఆయన ఈ సమావేశాలు జరిపారు.

సీఎం కుర్చీపైనా లొల్లి

కర్ణాటక సీఎంగా సిద్ధరామయ్య కొనసాగుతారా? లేక మరో కృష్ణుడు వస్తారా? అనే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జరుగుతున్నది. సీఎం పీఠాన్ని దక్కించుకొనేందుకు డీకే శివకుమార్ అంతర్గతంగా వ్యూహాలు పన్నుతున్నట్టు తెలుస్తున్నది. ఇదే సమయంలో సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహోళి వంటి నేతలు కూడా రేసులోకి వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత సీఎం పదవి కోసం డీకే తీవ్ర ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. అయితే సిద్ధరామయ్యకు సీఎం పదవి ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం.. రెండున్న రేండ్ల తర్వాత సీఎం చేసేలా డీకేను ఒప్పించినట్టు కూడా ప్రచారం ఉన్నది.

పరమేశ్వర

సంపదలో 99% విరాళం

న్యూయార్క్, నవంబర్ 28: ప్రపంచ ధనవంతులలో ఐదో స్థానంలో ఉండి, విజయవంతమైన ఇన్వెస్టర్‌గా పేరుపొందిన వారెన్ బఫెట్ మరణాంతరం తన సంపదలోని 99 శాతం దానం చేయడానికి నిర్ణయించారు. తన హోల్డింగ్ కంపెనీ బెర్క్‌షైర్ హత్‌వే, తన మరణానంతర ఉద్దేశాలను ఆయన ఒక లేఖలో వివరించారు. తన ముగ్గురు పిల్లలు తన వీలునామాకు కార్యనిర్వాహకులని తన సంపదలోని 99 శాతం తన చారిటబుల్ ట్రస్ట్‌కు వెళ్తుందన్నారు. బెర్క్‌షైర్‌లోని మిలియన్ల షేర్లను కుటుంబ సభ్యులకు అనుబంధంగా ఉన్న నాలుగు చారిటబుల్ ట్రస్ట్‌లకు కేటాయించనున్నట్టు ఆయన ప్రకటించారని ఫార్చున్ మ్యాగజైన్ వెల్లడించింది.

బొగ్గు కొరత వెనుక మర్మమేంటి?

- దిగుమతుల కోసం కృత్రిమ కొరత?
- ప్రైవేట్ కంపెనీలకు అనుచిత లబ్ధి!
- దీనిపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలి
- ప్రధాన లబ్ధిదారులెవరో తేల్చాలి
- కేంద్రానికి ఏఐపీఈఎఫ్ డిమాండ్
- భారత్‌కు బొగ్గు ఎగుమతుల్లో అదానీ కంపెనీదే అగ్రస్థానం



న్యూఢిల్లీ, నవంబర్ 28: దేశంలోని పలు థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో నెలకొన్న బొగ్గు కొరత, విదేశాల నుంచి బొగ్గు దిగుమతులపై ఆలిండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ (ఏఐపీఈఎఫ్) పలు అనుమానాలు వ్యక్తం చేసింది. దీనిపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐపీఈఎఫ్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. డిస్కమ్‌లు, వినియోగదారులపై భారం వేయకుండా, విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు దిగుమతి చేసుకొనే బొగ్గు అదనపు ధరను కేంద్రమే భరించాలని పేర్కొన్నది. బొగ్గు దిగుమతులను పెంచడం ద్వారా పలు సంస్థలకు అనుచిత లబ్ధి చేకూరుతున్నదని, అంతర్జాతీయ మార్కెట్‌లో బొగ్గు ధర విపరీతంగా పెరుగుతున్నదని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం విద్యుత్తు చట్టం-2003 కింద అసాధారణ అధికారాలను ఉపయోగించి దిగుమతి బొగ్గును తప్పనిసరిగా కొనుగోలు చేసి వినియోగించాలంటూ ఆదేశాలు ఇవ్వడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నది.

ప్రధానంగా లబ్ధి పొందిందెవరు?

బొగ్గు దిగుమతుల వల్ల ప్రధాన లబ్ధిదారులు ఎవరనేది 'టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ ఆఫ్ ది ఎంక్వైరీ'లో చేర్చాలని ఏఐపీఈఎఫ్ చైర్మన్ శైలేంద్ర దూబే పేర్కొన్నారు. దిగుమతి బొగ్గు ఆధారంగా పనిచేసే విద్యుత్తు ప్లాంట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం, అదేవిధంగా దేశీయ బొగ్గు ఆధారిత ప్లాంట్లు దిగుమతి బొగ్గు మిశ్రమాన్ని 4 నుంచి 6 శాతానికి పెంచాలని సూచనలు చేయడం వల్ల బొగ్గు దిగుమతులు భారీగా పెరిగాయని ఏఐపీఈఎఫ్ పేర్కొన్నది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో విద్యుత్తు చట్టంలోని సెక్షన్ 11 కింద ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. పెరిగిన విద్యుత్తు డిమాండ్, దేశంలో సరిడా బొగ్గు సరఫరా లేని కారణంగా దిగుమతి బొగ్గు ఆధారిత ప్లాంట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని అందులో పేర్కొన్నది. మొదట ఈ ఆదేశాలను ఈ ఏడాది మార్చి 16 నుంచి జూన్ 15 వరకు అమలు చేయగా, తర్వాత 2024, జూన్ వరకు పొడిగించారు.

అదానీదే సింహభాగం

విదేశాల నుంచి భారత్‌కు అత్యధికంగా బొగ్గు ఎగుమతి చేస్తున్న కంపెనీ అదానీ గ్రూప్‌దే. దేశంలో అత్యధికంగా థర్మల్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్న కంపెనీ, బొగ్గును సరఫరా చేసే ప్రైవేట్ రైల్వే ర్యాక్స్ వ్యవస్థ కూడా అదానీదే. దేశంలోని కీలకమైన బొగ్గు గనులే కాదు.. ఆస్ట్రేలియా, ఇండోనేషియా తదితర దేశాల్లోనూ అదానీ గ్రూప్‌నకు పెద్ద ఎత్తున బొగ్గు గనులున్నాయి. థర్మల్ విద్యుత్తు సంస్థలన్నీ తాము వాడే బొగ్గులో కనీసం 6 శాతం విదేశీ బొగ్గు కలుపాలని ఆదేశించటం, ఆయా కంపెనీలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని కేంద్రం పేర్కొనడం.. అదానీ గ్రూప్‌నకు అనుచిత లబ్ధి చేకూర్చడానికేననే విమర్శలు ఉన్నాయి.